సాక్షి
నంద్యాల
గురువారం ׀ 1 ׀ ఫిబ్రవరి ׀ 2024



వీరభద్రుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతికి, జ్వాలావీరభద్రస్వామికి అభిషేకం, పుష్పార్చనతో పాటు విశేష పూజలు నిర్వహించారు.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 0.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.



.. భరోసాలో టాప్

వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ–క్రాప్, రైతు భరోసా ద్వారా విత్తనం మొదలుకొని, పంట చేతికందే వరకు అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

10 నుంచి చౌడేశ్వరి దేవి మహోత్సవాలు



బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఉత్సవాలు ఫిబ్రవరి 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామానుజన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 10న మహాగణపతి పూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, సాయంత్రం అంకురార్పణం, అగ్నిప్రతిష్ట దీక్షా హోమం, జలాధివాసం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 11న స్వస్తీవాచనం, నవగ్రహ యోగిని క్షేత్రపాలక మంతపారాధనలు, యాగశాలారాధన, జపపారాయణ దీక్షా యాగమంటప దేవాతా హోమం, 12న స్వస్తీ వాహనం యాగశాలారాధనం, ప్రధాన హోమం, పుష్పాదివాసం, జప నారాయణములు, 13న దీక్షాహోమం, నవచండీ ప్రధాన దేవత యాగ మంటప దేవాతాహోమాలు, సామూహిక లలితాసహస్త్రనామ కుంకుమార్చన, 14న స్వస్తీవాచనం దీక్షాహోమం, చండీహోమాదులు, మహాకుంబాభిషేకం, గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

జిల్లా అడిషనల్ ఎస్పీ బదిలీ

బొమ్మలసత్రం: ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ జి వెంకటరాముడును ఉన్నతాధికారులు బుధవారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ ఎస్పీని నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేశారు. అక్కడి సెబ్ అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్‌ను నంద్యాల అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల (సెంట్రల్): స్థానిక మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. బుధవారం సూపర్ 10 రకం గరిష్ట ధర జనరల్ క్వింటాల్ రూ.17100, మధ్యస్థ ధర రూ.15,600, కనిష్ట ధర రూ.14,000 పలికింది. ఇదే రకం తాలు కాయ జనరల్ గరిష్ట ధర క్వింటాల్ రూ.9,300, మధ్యస్థ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.5,500 నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి ఐసీటీ సిమ్యులేషన్ ట్రైనింగ్

నంద్యాల(న్యూటౌన్): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, బనగానపల్లె, డోన్ మండల కేంద్రాల్లో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల గణిత, భౌతిక, జీవనశాస్త్ర ఉపాధ్యాయులకు ఒక్కరోజు ఐసీటీ సిమ్యులేషన్ ట్రైనింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీటీ జిల్లా కో ఆర్డినేటర్ జి.నాగేంద్రకుమార్, సైన్స్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ నంద్యాలలో ఫిబ్రవరి 2న గణితం, 3న భౌతిక శాస్త్రం, 5న జీవశాస్త్రంపై శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి సబ్జెక్టు వారీగా ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలన్నారు. శిక్షణకు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మరింత సమాచారం కోసం 9490516333 నెంబరును సంప్రదించాలన్నారు.

ఏహెచ్‌ఏలకు స్థానచలనం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 86 మంది అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ల(ఏహెచ్‌ఏ)ను బదిలీ చేస్తూ జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 130 మంది ఏహెచ్‌ఏలు పనిచేస్తున్నారు. వీరిలో కర్నూలు జిల్లాలో 40 మందిని, నంద్యాల జిల్లాలో 46 మందిని బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ పూర్తి కావడంతో కొత్త ఏహెచ్‌ఏలకు త్వరలో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఫిబ్రవరి నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ గురువారం నుంచి మొదలు కానుంది. ఇందుకు అవసరమైన నగదును బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీనే ఠంచన్‌గా పింఛన్లు పంపిణీ చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,72,716 మంది లబ్ధిదారులు ఉండగా రూ.141.02 కోట్లు విడదల చేసింది. కర్నూలు జిల్లాలో 2,48,231, నంద్యాల జిల్లాలో 2,24,395 మంది లబ్ధిదారులు ఇళ్ల వద్దనే పింఛన్లు అందుకోనున్నారు. ఈ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, అదనపు పీడీ షరీఫ్ పర్యవేక్షించనున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగనుంది.

అతివల ఇంట ఆనందాల కాపు

- జీవనోపాధులను మెరుగుపరిచిన 'వైఎస్సార్ కాపు నేస్తం'
- నాలుగు విడతల్లో ఉమ్మడి జిల్లాలో రూ.39.22 కోట్లు జమ
- నంద్యాల జిల్లాకు సింహభాగం నిధులు రూ.31.21 కోట్లు
- 26,152 మంది కాపు, బలిజ మహిళలకు అందిన ఆర్థిక సాయం

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలతో పాటు అగ్ర వర్ణాలకు చెందిన పేదలకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. వారి ఆర్థికాభివృద్ధికి, జీవనోపాధుల మెరుగుదలకు చర్యలు తీసుకుంటోంది. అగ్ర వర్ణాల్లోని పేదలకు ఈబీసీ నేస్తం కింద ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తోంది. అలాగే కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు చెందిన మహిళల జీవన ప్రమాణాలను పెంచేందుకు వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు ఏడాదికి రూ.15 వేల ప్రకారం నాలుగు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయ్యాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి ఈ పథకాన్ని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చి మాట ప్రకారం ప్రతి ఏడాది ఠంచన్‌గా కాపు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న ఈ మొత్తంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక మంది మహిళలు ఇళ్ల వద్దే చిరు వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవనోపాధులను మెరుగుపరుచుకున్నారు. కుటుంబానికి ఆర్థిక చేయూతను అందిస్తున్నారు.

సరళమైన నిబంధనలతో పథకం వర్తింపు

ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన కాపు మహిళలకు సరళమైన నిబంధనలను విధించింది. మహిళలు 45 నుంచి 60 సంవత్సరాల లోపు వారై ఉండాల్సి ఉంది. గ్రామాల్లో నివాసం ఉంటున్న వారి వార్షి ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో ఉన్న వారు రూ.12 వేలు కలిగి ఉండాలి. ప్రభుత్వం జారీ చేసిన సమగ్ర కుల ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు (ఆధార్, ఓటరు) కలిగిన వారై తమకు సమీపంలోని బ్యాంకుల్లో ఖాతా కలిగిన వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు.



జనరల్ స్టోర్ నిర్వహిస్తున్న నేసే సరస్వతి

నాలుగు విడతల్లో లబ్ధిదారుల వివరాలు

జిల్లా	విడుదలైన సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	విడుదలైన మొత్తం(రూ.ల్లో)
కర్నూలు	24-06-2020	1,184	1,77,60,000
	22-07-2021	1,240	1,86,00,000
	29-07-2022	1,403	2.10,45,000
	16-09-2023	1,513	2,26,95,000
నంద్యాల	24-06-2020	4,817	7,22,55,000
	22-07-2021	4,949	7,42,35,000
	29-07-2022	5,446	8,16,90,000
	16&09-2023	5,600	8,40,00,000

గాజుల వ్యాపారంలో రాణిస్తున్నా

కాపు నేస్తం ద్వారా ప్రభుత్వం ప్రతి ఏడాది అందిస్తున్న రూ.15 వేల ఆర్థిక సాయంతో వంశపారంపర్యంగా వస్తున్న గాజుల వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. మాకు ఎలాంటి భూములు లేవు. కేవలం గ్రామంలో గాజుల వ్యాపారం చేస్తు జీవనం కొనసాగిస్తున్నాం. మాలాంటి పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాల వల్ల ఎంతో ఆసరా పొందుతున్నారు. ఈ వ్యాపారంతోనే ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నాం.

– గాజుల లక్ష్మీదేవి, మొలగవెల్లి, ఆలూరు మండలం



కిరాణా స్టోర్ అభివృద్ధి చేసుకున్నాం

కాపు నేస్తం పథకం ద్వారా ఇప్పటి వరకు ఏడాదికి రూ.15 వేల ప్రకారం నాలుగు విడతల్లో రూ.60 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ డబ్బుతో అవసరమైన సరుకులను తెచ్చుకొని కిరాణా స్టోర్‌ను మరింత అభివృద్ధి చేసుకుంటున్నాం. ఇలాంటి పథకాలు అమలు చేయడం వల్ల మాలాంటి పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో ఉపయోగంగా ఉంటోంది. – నేసే సరస్వతి, తుగ్గలి

ఉమ్మడి జిల్లాలో 26,152 మందికి లబ్ధి

కాపు నేస్తం పథకం ద్వారా నాలుగు విడతల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 26,152 మంది మహిళలు లబ్ధి పొందారు. కర్నూలు జిల్లాలో కాపు, బలిజ, ఒంటరి కులాలకు చెందిన 5,340 మంది మహిళలకు రూ.8,01,00,000, నంద్యాల జిల్లాలో 20,812 మంది లబ్ధిదారులకు రూ.31,21,80,000 జమ అయ్యాయి. విడుదలైన మొత్తం రూ.39.22 కోట్లలో సింహభాగం నిధులు రూ.31.21 కోట్లు నంద్యాల జిల్లాకే విడుదలయ్యాయి.

పాల వ్యాపారం చేస్తున్నా



కాపు నేస్తం కింద ప్రతి ఏడాది విడుదలవుతున్న రూ.15 వేలతో పాల వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసున్నాం. ప్రభుత్వం అందిస్తున్న నగదుతో బర్రెలకు అవసరమైన దాణా, మేత (వరి గడ్డి , వేరుసెనగ కట్టె) తదితరాలను కొనుగోలు చేసుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న మేలును ఎన్నటికీ మరచిపోలేం. – జీ ఫక్కీరమ్మ, గణేష్‌నగర్, కర్నూలు

జీవన స్థితులు మెరుగయ్యాయి



వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 26,152 మంది కాపు, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు రూ.39.22 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఆయా ప్రాంతాల్లోని మహిళలు వివిధ రకాల చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవన స్థితిగతులను మెరుగుపరచుకుంటున్నారు. చేస్తున్న వ్యాపారాలతో వచ్చే ఆదాయంతో కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు.

– పీ వెంకటలక్షుమ్మ, ఈడీ, బీసీ కార్పొరేషన్

నంద్యాలకు డీజీపీ



డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసిన డీఐజీ సెంథిల్‌కుమార్

బొమ్మలసత్రం: రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం నంద్యాల జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఎస్బీఐ కాలనీలో డీజీపీ సోదరి, బావ వెంకటరెడ్డి నివసించేవారు. వెంకటరెడ్డి ఉపాధ్యాయునిగా పనిచేసి కొంత కాలం క్రితం పదవీవిరమణ పొందారు. రెండు రోజుల క్రితం అనారోగ్యం కారణంగా ఆయన మృతిచెందారు. ఈక్రమంలో వెంకటరెడ్డి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన డీజీపీని డీఐజీ సెంథిల్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం డీజీపీకి నంద్యాల, కర్నూలు జిల్లాల ఎస్పీలు కె రఘువీర్‌రెడ్డి, కృష్ణకాంత్ స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేసి బందోబస్తు నియమించారు.

ఆధారాలు లేకుండా రాయడం ఫ్యాషనైపోయింది

- 200 ఎకరాలు ఎక్కడుందో చూపిస్తే అది వారికే రాసిస్తా
- ఎమ్మెల్యే కాకముందు టీడీపీలో ఉన్నప్పుడే ఆఫీస్ కట్టుకున్నా
- ఆంధ్రజ్యోతి పిచ్చిరాతలపై న్యాయస్థానంలో దావా వేస్తా
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఇష్టమొచ్చినట్లు రాయడం పచ్చ మీడియాకు ఫ్యాషనైపోయిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఏమాత్రం ఆధారాలు లేక పోయినా, కనీస పరిజ్ఞానం లేకుండా తన మీద, తన కుటుంబ సభ్యులపైనా ఆంధ్రజ్యోతి పత్రిక అసత్య కథనం ప్రచురించడంపై న్యాయస్థానంలో దావా వేస్తానన్నారు. నియోజకవర్గంలో 200 ఎకరాల పొలం ఎక్కడ ఉందో దమ్ముంటే ఆధారాలు చూపితే ఆంధ్రజ్యోతి వారికే రాసిస్తానని సవాల్ చేశారు. తాను ఎమ్మెల్యే కాక ముందు టీడీపీలో ఉన్న సమయంలోనే కార్యాలయం కట్టుకున్నానన్నారు. అప్పు చేయకుంటే ఇల్లు గడవని పరిస్థితి అని రాసేందుకు కాస్తన్నా సిగ్గుందా అని మండిపడ్డారు. తాను పుట్టే సరికే హైదరాబాద్‌లో సొంతిల్లు ఉందని, 1990 లోనే తన తండ్రి హైదరాబాదులోని మేడ్చెల్‌లో 16 ఎకరాల ఫామ్‌హౌస్ కొన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో అనేక రకాల ఆస్తులు ఉండగా 2016 నుంచి రాజకీయాల కోసం ఒక్కొక్కటిగా విక్రయించుకుంటూ వచ్చానన్నారు. ఇదంతా డాక్యుమెంట్ ఆధారంగా చూపిస్తానన్నారు. ఆళ్లగడ్డలో ఒక్కరితోనైనా తాను కబ్జా చేశానని నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. తమ తాత కాలం నుంచి ఇప్పటి వరకు నైతిక విలువలతో రాజకీయం చేస్తున్నామన్నారు. ఎవడో ఏదో చెప్పాడని ఇంట్లో ఆడవాళ్ల గురించి కూడా ఏది పడితే అది రాస్తే చూస్తూ ఊరుకుండేది లేదని హెచ్చరించారు. ఆళ్లగడ్డలో బీసీ వర్గాలకు చెందిన వందలాది ఎకరాలు రూ.5 వేలకు, రూ.6 వేలకు లాక్కున్న వారెవరో తెలియదా అని ప్రశ్నించారు. దమ్ముంటే అలాంటి వారిపై రాయాలని హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, నాయకులు సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాదం చెన్నయ్య పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా

రెండు రోజుల్లో రైస్ కార్డు



రేషన్ కార్డు కోసం గతంలో ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా లాభం లేకపోయింది. దీంతో విసిగిపోయి దరఖాస్తు చేయడమే మానేశాను. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాకు మేలు చేశారు. వలంటీర్ నా ఇంటి వద్దకే వచ్చి రేషన్‌కార్డుకు దరఖాస్తు తీసుకున్నారు. కేవలం రెండు రోజుల్లో రేషన్‌కార్డు చేతికిచ్చారు. కార్డు వచ్చిన క్షణమే సచివాలయ సిబ్బందికి, వలంటీర్‌కు, సీఎంకు కృతజ్ఞతలు తెలిపాను. ప్రస్తుతం ప్రతి నెలా రేషన్ బియ్యం తీసుకుంటున్నాను. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– గొల్ల విజయభాస్కర్, ఆలమూరు, పాణ్యం మండలం

ఎదురు చూసే బాధ తప్పింది



నేను పుట్టుకతోనే దివ్యాంగుడిని. నెలనెలా పింఛన్ కోసం టీడీపీ ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడ్డాను. పంచాయతీ కార్యదర్శి నాలుగైదు ఊళ్లకు పింఛన్ పంచేవాడు. మా ఊరికి ఎప్పుడు వస్తాడోనని ఎదురు చూసేటోళ్లం. పింఛన్ చేతికొచ్చేలోపు కనీసం పది రోజులైనా పట్టేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ కోసం ఎదురు చేసే బాధ తప్పింది. వలంటీర్ ఉదయం ఏడు గంటల్లోపే మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి పోతాడు. నాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూతురుకు వివాహమైంది. నా కుమారుడు 9, 10వ తరగతి చదవే సమయంలో రెండు సార్లు అమ్మ ఒడి కింద రూ.15 వేల చొప్పున పడింది. వైఎస్సార్ చేయూత పథకానికి నా భార్య అర్హత సాధించింది. వచ్చే నెలలో రూ.18,750 అకౌంట్‌లో జమ అవుతుంది. నేను నాయీ బ్రాహ్మణుడిని కావడంతో గ్రామంలోనే చిన్న బంకులో బార్బర్ షాపు నడుపుకుంటున్నాను. ఏటా నాయీ బ్రాహ్మణులకు ఇచ్చే రూ.10 వేల ఆర్థిక సాయం అందుతుంది. ఇలా మాకు ప్రతి పథకం సులభంగా అందుతుంది. మాలాంటి మధ్య తరగతి వారికి ఇంతకంటే ఇంకేం కావాలి. – కె.రామచంద్రుడు, అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల మండలం

దివ్యాంగులకు డిజిటల్ విద్య

- జిల్లాలో 140 ట్యాబ్‌ల పంపిణీ
- దృష్టి, వినికిడి లోపాల విద్యార్థుల కోసం ప్రత్యేక యాప్‌లు
- ట్యాబ్‌ల వినియోగంపై సమగ్ర శిక్ష ద్వారా శిక్షణ
- దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి



దివ్యాంగులకు ట్యాబ్‌లను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. డిజిటల్ చదువుల నిమిత్తం ఇప్పటికే 8వ తరగతి విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్యాబ్‌లను రెండు విడతలుగా అందించారు. తాజాగా భవిత కేంద్రాల్లో (ప్రత్యేక అవసరాల పిల్లల వనరుల కేంద్రం) దివ్యాంగులకు అత్యాధునిక ట్యాబ్‌లను అందజేస్తున్నారు. దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు. ఇందు కోసం ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్(ఐఈఆర్టీ), దివ్యాంగుల తల్లిదండ్రులకు ట్యాబ్‌ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

29 భవిత కేంద్రాల్లో..

జిల్లాలో 29 భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో మొత్తం 4,120 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఐఈఆర్‌టీలు 58 మంది ఉండగా, హైస్కూల్ స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్) బీఈడీ చేసిన ఉపాధ్యాయులు.. 36 మంది దివ్యాంగుల కోసం విధులు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లో దివ్యాంగులకు 140 ట్యాబ్‌లు, అలాగే పాఠాలు బోధించే ఐఈఆర్‌టీ, స్కూల్ అసిస్టెంట్లకు 58 ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది.

ఆధునిక సాంకేతికతతో..

దృష్టి, వినికిడి లోపాలు కలిగిన విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లు అందిస్తున్నారు. అంధులు, పాక్షిక అంధులు, బధిరులు, పాక్షిక బధిరులకు వీలుగా టాక్ బ్యాక్ (ట్యాబును ఏ వైపు ఉపయోగించినా స్పందించే యాప్), స్పోకెన్ అసిస్టెంట్ (శబ్ద సాంకేతల ద్వారా ట్యాబ్‌ను ఉపయోగించే యాప్), విజిబిలిటీ ఇన్‌ఎన్స్‌మెంట్ (దృష్టి లోపం ఉన్నవారికి చిన్న చిన్న విషయాలను స్పష్టంగా చూపడానికి ఉపయోగించే యాప్), మిషన్ ఏఐ, 'ఎన్' విజన్ యాప్‌లు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే యాప్) వంటి పలు యాప్‌లను ట్యాబ్‌లో పొందపరిచారు. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు వినియోగించకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు.


ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ప్రత్యేక అవసరాల బాలబాలికలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. జనవరి 28న 140 మంది దివ్యాంగులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇటీవల ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం వైద్య నిర్ధారణ శిబిరాలను నిర్వహించారు. మండలానికి ఒక భవిత కేంద్రం చొప్పున ఏర్పాటు చేసి చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్యం అందిస్తున్నారు.

ట్యాబ్‌ల పంపిణీ.. నంద్యాల జిల్లా

కేంద్రాలు	29
చిన్నారులు	4120
ట్యాబ్‌ల అందజేత	140
ఐఈఆర్‌టీలు	58
స్కూల్ అసిస్టెంట్ బీఈడీలు	36

దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం



భవిత కేంద్రాల్లో విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేలకు పైగా విలువైన ట్యాబ్ అందిస్తున్నారు. వారికి సులభతరంగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తెచ్చాం. ఇప్పటికే బుద్ధి మాంద్యం గల దివ్యాంగులకు విలువైన సీపీ చైర్లను పంపిణీ చేశాం. ట్యాబ్‌ల ద్వారా దివ్యాంగులు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటారు.

– రఘురామిరెడ్డి, ఐఈఆర్‌టీ జిల్లా కో ఆర్డినేటర్

ప్రభుత్వ మేలు మరువలేం

మా పాప ఝాన్సీదేవి కంటి సమస్యతో బాధపడుతోంది. ప్రత్యేక అవసరాల కేంద్రంలో శిక్షణ తీసుకుంటుంది. ఇప్పుడు ప్రభుత్వం దృష్టి లోపం ఉన్న వారు సైతం చక్కగా అర్థం చేసుకునేలా ట్యాబ్‌లను అందించారు. దివ్యాంగులపై ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. తల్లిదండ్రులకు కూడా శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును మరువలేం. – పద్మావతి, విద్యార్థి తల్లి, ఆళ్లగడ్డ

క్లుప్తంగా

ఉపాధి పనులను గుర్తించండి


డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 సంవత్సరంలో ఉపాధి పనులకు ఇబ్బంది లేకుండా అవసరమైన పనులను గుర్తించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీఓలు, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెల తర్వాత ఎప్పుడైనా సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని, ఆలోపు ఉపాధి పనులను గుర్తించడంతో పాటు జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు తీసుకోవాలన్నారు. ఫాంపాండ్స్, అమృత్ సరోవర్‌లు, మినీ అమృత్ సరోవర్‌లు, ఇతర జలసంరక్షణ పనులను గుర్తించాలన్నారు. 10 వేల ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 2వేల ఎకరాలకు మాత్రమే రైతులను గుర్తించారని తెలిపారు. పది రోజుల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్ మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ చాంద్‌బాషా (52) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన చాంద్‌బాషా లారీలో ఇనుప కడ్డీల లోడ్‌తో హైదరాబాద్ నుంచి అనంతపురం బయలుదేరాడు. పోతుదొడ్డి వద్దకు రాగానే లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో చాంద్‌బాషా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మమూద, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రాయలసీమ విశ్వ విద్యాలయంతో పాటు నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం జరిగిన పరీక్షలకు 541 మందికి గాను 516 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.నరసింహులు తెలిపారు.

గుడికి వెళ్లి.. బావిలో శవమై తేలి!

- అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

హాలహర్వి: మండలంలోని విరుపాపురం గ్రామంలో ఓ యువతి అదృశ్యమై బుధవారం తెల్లవారుజామున ఊరి సమీపంలో ఉండే బావిలో శవమై తేలింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన సుస్మిత(19) సోమవారం ఉదయం గుడికి వెళ్లి పూజ చేసి వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ తెలియరాలేదు. అయితే బుధవారం విరుపాపురం గ్రామ సమీపంలో ఉండే దిగుడుబావిలో సుస్మిత శవమై తేలింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

హాలహర్వి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బావిలో ఉన్న యువతి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

ఈ- క్రాప్.. భరోసాలో టాప్

- జిల్లాలో 2.95 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- వేగవంతంగా కొనసాగుతున్న పంటల నమోదు
- ఇప్పటి వరకు 95 శాతం ప్రక్రియ పూర్తి
- పొలం వద్దనే రైతుల నుంచి వివరాల సేకరణ
- ఈ క్రాప్ ఆధారంగానే రైతులకు అన్ని రాయితీలు


గుళ్లదూర్తి సమీపంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం విత్తనం మొదలుకొని, పంటచేతికందే వరకు అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. ఏటా రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం, రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని ఎరువులు సరఫరా చేయడంతోపాటు అయా పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు ఎప్పటికప్పుడూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. వీటితోపాటు అతివృష్టి, అనావృష్టి, తదితర ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం సంభివిస్తే నష్టపరిహారం చెల్లించేందుకు ఈ క్రాప్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది 4 లక్షల ఎకరాల్లో వరి, శనగ, మినుము, పొగాకు, జొన్న, కొర్ర, కంది, నువ్వు, పొద్దుతిరుగుడు, టమాట, వంగ, గోధుమ, సోయాబీన్, ఆవాలు, తదితర పంటలు సాగు చేయాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆయా మండలాల్లో 2.95 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 63,962 ఎకరాల్లో శనగ, 4,305 ఎకరాల్లో మినుము, 1,850 ఎకరాల్లో ఎండు మిర్చి, 21,985 ఎకరాల్లో జొన్న, 834 ఎకరాల్లో పొగాకు, 264 ఎకరాల్లో పెసర, 1,696 ఎకరాల్లో మొక్కజొన్న, 527 ఎకరాల్లో కంది, పంటలు సాగయ్యాయి.

పారదర్శకంగా పంటనష్ట పరిహారం:

ఈ ఏడాది అక్టోబర్ నెల 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. రైతులకు ఈ క్రాప్ ఆధారంగానే పంటనష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందులో భాగంగా ఆయా మండలాల పరిధిలో ఏఏ పంటలు సాగు చేశారు? ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు? అనే వివరాలను వ్యవసాయశాఖ అధికారు లు, సిబ్బంది పొలాల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో వివరా లు సేకరిస్తున్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలోని వ్యవసాయ, ఉద్యానవన, సెరీ కల్చర్ అసిస్టెంట్లు పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ జిల్లాలో దాదాపు తుది దశకు చేరుకుంది. ఈ క్రాప్ నమోదు కోసం రైతుల వద్ద నుంచి ఆధార్, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబర్లు తీసుకుని ఆధార్ బేస్ట్ డేటాను అనుసంధానం చేసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా ఆయా సహాయ వ్యవసాయ సంచాలకులు, మండ ల వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. జిల్లాలో 2.95 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా ఇప్పటి వరకు 95 శాతం పంటల నమోదు ప్రక్రియ పూర్తయింది. ఈ నెలాఖరుకంతా వందశాతం పూర్తి చేసే దిశగా కసరత్తు కొనసాగుతోంది.

ప్రయోజనాలివి

వరదలు, తుఫాన్లు, వర్షాభావం, తదితర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం సంభవిస్తే ఈ క్రాప్ ఆధారంగా ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. పంటలబీమా, సున్నావడ్డీ రుణాలు వర్తించాలన్న ఈక్రాప్ తప్పనిసరి. విత్తనాలు, ఇతర వ్యవసాయ సబ్సిడీలు, పంట ఉత్పత్తులు చేతికందాక ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటల నమోదు ఆధారంగానే దిగుబడుల విక్రయాలు కొనసాగుతాయి. నేరుగా సాగుదారులకే ప్రభుత్వ పథకాలు వర్తింప చేసేందుకు ఈ క్రాప్ ప్రామాణికం. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు దిగుబడులపై కాస్త ప్రభావం చూపడంతో రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు ఆయా పంటల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు చేపట్టింది. గ్రామ, మండలస్థాయి యూనిట్లుగా విభజించి శనగ, జొన్న, కంది, మినుము, తదితర పంటల్లో పంట కోత ప్రయోగాలు కొనసాగుతున్నాయి. పంట కోత ప్రయోగాల్లో దిగుబడులు తగ్గితే వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తారు. వీటి ఆధారంగా రైతుల ఖాతాల్లో నేరుగా పంటనష్ట పరిహారం జమ అవుతుంది.

జిల్లాలో సబ్ డివిజన్ల వారీగా ఈ క్రాప్ వివరాలు

సబ్ డివిజన్	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ క్రాప్ నమోదు	శాతం
కోవెలకుంట్ల	1,00,510	96,974	97
ఆళ్లగడ్డ	63,119	59,896	94
నంద్యాల	55,183	51,165	92
డోన్	9,606	8,644	89
ఆత్మకూరు	26,007	25,637	98
నందికొట్కూరు	40,664	39,942	98


కోవెలకుంట్ల సమీపంలో రబీలో సాగైన కుసుమ పంట

పొలం వద్దనే వివరాలు నమోదు



ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు పకడ్బందీగా నమోదు చేశారు. నాకున్న రెండు ఎకరాల పొలంతోపాటు ఎకరాకు రూ.10వేలు కౌలు చెల్లించి మరో రెండు ఎకరాల్లో శనగ, జొన్న పంటలు సాగు చేశాను. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబర్, తదితర వివరాలతో అధికారులు పొలం వద్దనే వివరాలు సేకరించారు.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

ఈ క్రాప్ ఆధారంగానే అన్ని సబ్సిడీలు



పంటల నమోదు ఆధారంగా రైతులకు అన్ని రకాల సబ్సిడీలను వర్తింపజేస్తున్నాం. సబ్ డివి జన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలి మిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలా ల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 1,41,781 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా లక్ష ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటి వరకు 97 శాతం పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేశాం.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

రెవెన్యూలో బదిలీల పర్వం

- పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ
- కర్నూలు ఆర్‌డీఓగా ఎం.శేషిరెడ్డి
- మదనపల్లె ఆర్‌డీఓగా హరిప్రసాద్ బదిలీ
- 61 మంది తహసీల్దార్లను బదిలీ చేసిన సీసీఎల్‌ఏ

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ శాఖలో మూడేళ్లుగా ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ బదిలీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కర్నూలు ఆర్‌డీఓగా పనిచేస్తున్న హరిప్రసాద్ మదనపల్లె ఆర్‌డీఓగా బదిలీ అయ్యారు. కర్నూలు ఆర్‌డీఓగా నరసరావుపేట ఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎం.శేషిరెడ్డిని నియమించారు.

- శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ ఏపీగా పనిచేస్తున్న కె.అనురాధను వైఎస్‌ఆర్ జిల్లా డీపీఎం డీఎంగా నియమించారు.
- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 ఎస్‌డీసీగా ఉన్న ఎస్.రమను అన్నమయ్య జిల్లా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఎస్‌డీసీగా బదిలీచేశారు. ఆమె స్థానంలో ఏ.మురళీని నియమించారు.
- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–4 ఎస్‌డీసీగా డి.రామునాయక్‌లు నాయక్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కె.మల్లికార్జునుడును ప్రభుత్వంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.
- జాతీయ రహదారుల విభాగం ఎస్‌డీసీగా ఎంఎల్ నరసింహంను నియమించి, ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణను నంద్యాల జిల్లా హౌసింగ్ పీడీగా బదిలీచేశారు.

జిల్లాకు 61 మంది తహసీల్దార్ల కేటాయింపు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న 61 మంది తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. అదే సమయంలో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న 61 మంది తహసీల్దార్లను జిల్లాకు కేటాయించారు. 2024 జూన్ 30 నాటికి మూడేళ్ల సర్వీసు పూర్తి కాని ఒక తహసీల్దార్‌కు, పదవీ విరమణ జూన్ 30లోపు ఉన్న 8మంది తహసీల్దార్లకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు కర్నూలుకు 30 మంది, నంద్యాలకు 31 మంది తహసీల్దార్లను కేటాయించారు. వీరికి ఆయా జిల్లాల కలెక్టర్లు మండలాలను కేటాయించనున్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య
- జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య, చిత్రంలో మేయర్ రామయ్య తదితరులు

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల జిల్లా నోడల్ ఆధికారి నారపు రెడ్డి మౌర్య అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అలాగే ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను మేయర్ బీవై రామయ్య ప్రారంభించారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి వచ్చిన క్రీడాకారులతో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. క్రీడా జ్యోతిని ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, స్పోర్ట్స్ డ్రస్ ఇవ్వడమే కాకుండా ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గత ఏడాది డిసెంబర్ 26న జిల్లాలో ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు సచివాలయాల స్థాయిలో ప్రారంభమయ్యాయన్నారు. నేడు జిల్లా స్థాయిలో జరుగుతున్నాయన్నారు. గ్రామస్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారన్నారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. పోటీల్లో క్రీడాకారులు ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం క్రికెట్ పోటీలను బ్యాటింగ్ చేసి జేసీ, మేయర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్రా క్రీడల అంబాసిడర్ షేక్ జాఫ్రీన్, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, సెట్కూర్ సీఈఓ పి.వి.రమణ, కార్పొరేటర్లు గాజుల శ్వేతా రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు


చుంచు ఎర్రగుడిలో అక్రమంగా గ్రావెల్ తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలో వివిధ చోట్ల అక్రమంగా గ్రావెల్ తరలించినట్లు తమ విచారణతో తేలిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కల్లూరుకు చెందిన ఎస్ ప్రభుదాస్, షేక్ మహమ్మద్ అలీ ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 863లో 1,667 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తరలించారని విచారణలో తేలిందన్నారు. గూడూరు మండలానికి చెందిన ఎ నజీర్.. సర్వే నంబర్ 663/2లో అక్రమంగా 1,121 క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌తరలించారని విచారణలో బయట పడిందన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఎస్ఎన్ చాంద్‌బాషా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 119/2లో 350 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తవ్వి తరలించారని తనిఖీలో తేలిందన్నారు. మొత్తం 3,138 క్యూబిక్ మీటర్లు అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలించిన అక్రమార్కులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. కృష్ణగిరి మండలం చుంచుఎర్రగుడి గ్రామంలో సర్వే నంబర్ 560లో లీజుదారుడు గని తరపున కేటాయించిన ప్రదేశం నుంచి 0.12 హెక్టార్లు బయటకు జరిగి ఖనిజ సంపదను తవ్వకాలు జరిపినట్లు విచారణలో తేలిందన్నారు. దీనికి సంబంధించిన యజమాని ఎస్ సూర్యచంద్రుడు నుంచి రూ.60వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లారీలు సీజ్

డోన్ నుంచి హైదరాబాద్, బెంగళూరుకు అక్రమంగా డొలమైట్ తరలిస్తున్న రెండు లారీలను డోన్ సమీపంలో సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. అలాగే కల్లూరు మండలం ఉలిందకొండ దగ్గర అక్రమంగా మెటల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. మొత్తం రూ.1.20లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈఓ సమీక్ష


మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో త్వరలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాలలో నిర్వహించాల్సిన ఆయా వైదిక కార్యక్రమాలు, వాహనసేవలు, స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ, ఉత్సవ సమయాలలో ఆలయ వేళలు, దర్శనం ఏర్పాట్లు మొదలైన వాటి గురించి చర్చించారు. పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి మొదలైన చోట్ల చేయాల్సిన ఏర్పాట్లను ముందస్తుగా చేయాలని ఆదేశించారు. శివదీక్షా శిబిరాల వద్ద జ్యోతిర్ముడి సమర్పణకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఉచిత దర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లన్నింటినీ గత సంవత్సరం కంటే వీలైనంత మేరకు పెంచాలన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాత్కాలిక వసతి కల్పించేందుకు ఆరుబయలు ప్రదేశాలలో పైప్ పెండాల్స్, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలలో సామగ్రి భద్రపర్చుకునే గదులు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాలలో విద్యుద్దీకరణ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమీక్షలో దేవస్థాన అధ్యాపక సీనియర్ వేదపండితులు, అన్ని విభాగాల అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు 9లోగా అడ్వాన్స్ చెల్లించాలి


హఫీజ్ మంజూర్ అహమ్మద్, ఏపీ స్టేట్ హజ్ కమిటీ మెంబర్

కర్నూలు(అర్బన్): హజ్ యాత్రకు ఎంపికైన 385 మంది ఈ నెల 9వ తేదీలోగా అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాలని ఏపీ స్టేట్ హజ్ కమిటీ మెంబర్ హఫీజ్ మంజూర్ అహమ్మద్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపికై న యాత్రికులు ఒరిజినల్ పాస్‌పోర్టు, రూ.81,800 ఒరిజినల్ పేస్లిప్, ప్రభుత్వ వైద్యుడు ధ్రువీకరించిన ఒరిజినల్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో (స్త్రీలకు చెవులు కనిపించాలి), ప్రింటెడ్ హజ్ దరఖాస్తు ఫారం (దరఖాస్తుదారుడు, నామినీ చేత సంతకం చేసినది)ను ఈ నెల 12వ తేదీలోగా సమర్పించాలన్నారు. అలాగే ఏప్రిల్ 24వ తేదీ నాటికి ఎన్ఆర్ఐ అంతర్జాతీయ పాస్‌పోర్టును అందించాల్సి ఉందన్నారు. భవనం, విమానంలో వసతి కేటాయింపు కోసం మార్చి 31వ తేది నాటికి వివరాలను అందించాలన్నారు. హజ్ మొత్తాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా సంఖ్య : 35398104789, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా సంఖ్య : 318702010406010 లో చెల్లించాల్సి ఉందన్నారు.

వాహనదొంగలు అరెస్టు

కర్నూలు : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసి తప్పించుకుతిరుగుతున్న ఇద్దరు దొంగలను నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. సీఐ శంకరయ్య, ఎస్ఐ మోహన్‌కిషోర్ రెడ్డి తమ సిబ్బందితో కర్నూలు శివారులోని సంతోష్‌నగర్ ఆర్చి దగ్గర మంగళవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. ప్రొద్దుటూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన పిల్లిభద్రి అలియాస్ మహేష్, రంగారెడ్డి జిల్లా కొందుర్గ మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన కావలి నరసింహులు జట్టుగా ఏర్పడి కొంతకాలంగా మోటర్‌సైకిల్ దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి మొత్తం ఐదు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

పదవీ విరమణ సమస్యలుంటే నేరుగా సంప్రదించండి


ఎస్ఐ రఘురామయ్య దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: పోలీసు శాఖలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. కర్నూలు స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తూ ఎల్.రఘురామయ్య పదవీ విరమణ పొందారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనను ఎస్పీ శాలువ, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన రఘురామయ్య 1987లో కానిస్టేబుల్ హోదాలో పోలీసు శాఖలో చేరారు. 2020లో ఎస్ఐగా పదోన్నతి పొంది వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. పోలీసు శాఖలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా ఎస్పీ కొనియాడారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాసరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, కార్యనిర్వాహక సభ్యులు ఖాజా బంద, పోలీస్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు రఘురాముడు తదితరులు పాల్గొన్నారు.

పది మంది వీధి బాలల గుర్తింపు

కర్నూలు (లీగల్): నగరంలో పది మంది వీధి బాలలను బుధవారం అధికారులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలలు విద్యను అభ్యసించడం కోసం సహాయం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం నగరంలో రెండు బృందాలుగా వెళ్లి తనిఖీలు నిర్వహించారు. కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, రాజ్‌విహార్, ఎన్ఆర్ పేట, రైల్వేస్టేషన్, వీఆర్ కాలనీ, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఫోర్త్ టౌన్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ ఉద్యోగులు అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు.